సాక్షి
జోగులాంబ గద్వాల

ఆదివారం ; 3 ; డిసెంబర్ ; 2023



ప్రవేశాలు జరిగేనా..?
పాలమూరులోని వాలీబాల్ అకాడమీ ప్రవేశాలకు నోచుకోక వృథాగా మారింది.

వివరాలు 8లో ▸



మద్యం విక్రయాలు షురూ
కొత్త ఎక్సైజ్ పాలసీ ప్రకారం ఉమ్మడి జిల్లాలో మద్యం విక్రయాలు ప్రారంభమయ్యాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.4 /19.8
వాతావరణం
అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తెల్లవారుజామున, రాత్రివేళల్లో చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఆదిశిలా క్షేత్రంలో భక్తుల ప్రత్యేక పూజలు



మల్దకల్: స్థానిక స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మధుసూదనాచారి, రమేషాచారి, రవిచారి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కొంత మంది భక్తులు స్వామి వారికి దాసంగా నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదిశిలా క్షేత్రం, కృష్ణస్వామి ఆలయాలలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, నాగరాజుశర్మ, బాబురావు, ఆలయ సిబ్బంది ఉరుకుంద, శ్రీను, రంగ స్వామి, కృష్ణ, శివమ్మ తదితరులు ఉన్నారు.

నిందితులకు శిక్ష పడేలా చూడాలి

గద్వాల క్రైం: వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న వారికి శిక్ష పడేలా కోర్టు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎస్పీ రితిరాజ్ అన్నారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో కోర్టు సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పలు స్టేషన్‌లో నమోదైన అత్యాచార, పోక్సో, హత్యలు, దొంగతనం తదితర కేసుల్లో నిందితులుగా ఉన్న వారిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసి శిక్ష పడేలా చూడాలన్నారు. ఎలాంటి పక్షపాతం వహించకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిబ్బంది తదితరులు ఉన్నారు.

అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



తేజ



ఆకుల రాహుల్



పవన్‌కుమార్

గద్వాల అర్బన్: పాలమూరు యూనివర్సిటీలో ఆలిండియా సౌత్ జోన్ అంతరాష్ట్ర ఫుట్‌బాల్ పోటీలకు పురుషుల జట్టు ఎంపిక చేయగా.. జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిలో జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు తేజ, రాహుల్, పవన్‌కుమార్ ఎంపికయ్యారు. వీరు ఈ నెల 12న యూనివర్సిటీ ఆఫ్ కేరళ, తిరువనంతపురంలో జరగబోయే ఫుట్‌బాల్ పోటీలకు పీయూ టీం తరుపున పాల్గొననున్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా, వైస్ ప్రిన్సిపాల్ శ్రీపతినాయుడు, కళాశాల ఇంచార్జ్ ఫిజికల్ డైరెక్టర్ హరిబాబు, ఏఓ మక్బూల్ అహ్మద్, అధ్యాపక బృందం అభినందించారు.

ఆర్‌ఎన్‌ఆర్ క్వింటా ధర రూ.3,013

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం జరిగిన ఈనామ్ టెండర్లలో ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.3,013, కనిష్టంగా రూ.2,442 ధరలు లభించాయి. అలాగే హంస ధాన్యం గరిష్టంగా రూ.2,006, కనిష్టంగా రూ.1,781 చొప్పున పలికాయి. మార్కెట్‌కు దాదాపు మూడు వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువు పెంపు

నారాయణపేట రూరల్: తెలంగాణ సార్వత్రిక విశ్వవిద్యాలయం ద్వారా టెన్త్, ఇంటర్ చేసే అభ్యర్థులు 2023–24 విద్యా సంవత్సరంలో చేరడానికి దరఖాస్తు గడువును పొడగించినట్లు డీఈఓ అబ్దుల్ ఘని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఫీజు మీ సేవా కేంద్రంలో చెల్లించాలని సూచించారు. వివరాలకు దగ్గరలోని కేంద్రాల నిర్వాహకులను సంప్రదించాలని తెలిపారు.

పీజీలో మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కందనూలు: జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ(ఆర్ట్స్ అండ్ కామర్స్) కళాశాలలో ఎంఏలో తెలుగు, ఎకనామిక్స్, ఎంకం కోర్సుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు మీ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. సెల్ 9505755892 సంప్రదించాలని కోరారు.

● జడ్జిమెంట్ డే

విజేతలెవరో?

నేడే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు..



గద్వాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, తదితరులు

- ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు
- ఉదయం 8 గంటల నుంచే కౌంటింగ్ ప్రారంభం
- ప్రజా తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ
- కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు
- గెలుపుపై ఎవరికి వారే ధీమా



నరాలు తెగే ఉత్కంఠ.. విజేతలెవరో, పరాజితులెవరో తేలే సందర్భం. తమ నుదిటి రాత ఎలా ఉండబోతోందంటూ బరిలో నిలిచిన నేతల్లో ఉద్విగ్నత... కూడికలు, తీసివేతల లెక్కలతో పార్టీలు, అభ్యర్థులు ఎడతెగని కుస్తీ.. ఓటరు దేవుడు వెల్లడించే తీర్పు కోసం ఎదురు చూపులు.. గెలుపోటములు, ఓట్లు, సీట్ల లెక్కలతో సంబంధం లేకుండా అధికార యంత్రాంగం ఓట్ల లెక్కింపు ఏర్పాట్లలో బిజీ...ఇది ఆదివారం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో నెలకొన్న పరిస్థితి.

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్ / సాక్షి, నాగర్‌కర్నూల్: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. ఆదివారం ఉదయం 8 గంటల నుంచే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నియోజకవర్గాల కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభంకానుంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఇప్పటికే అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు కౌంటింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున కౌంటింగ్ చేపట్టనుండగా, ఒక్కో నియోజకవర్గానికి 19 నుంచి 21 వరకు రౌండ్లలో లెక్కింపు ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు..

ఆదివారం ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఆయా జిల్లాకేంద్రాల్లోనే జిల్లాల పరిధిలోని నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. కౌంటింగ్ ప్రక్రియలో ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా రెండు టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత సర్వీస్ ఓటర్ల లెక్కింపు చేపడతారు. నియోజకవర్గాల వారీగా ఇప్పటికే అందిన ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీపీబీఎస్) సర్వీస్ ఓటర్ల ఓట్లను లెక్కించనున్నారు. అనంతరం సుమారు 8.30 గంటల నుంచి ఈవీఎంల ద్వారా ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది.

నియోజకవర్గాల వారీగా పోస్టల్ బ్యాలెట్ వివరాలు..

నియోజకవర్గం	పోస్టల్ బ్యాలెట్లు	టేబుళ్లు
మహబూబ్‌నగర్	3,923	7
జడ్చర్ల	1,111	2
దేవరకద్ర	992	2
వనపర్తి	3,400	2
నాగకర్నూల్	1,412	2
అచ్చంపేట	1,884	2
కొల్లాపూర్	1,742	2
కల్వకుర్తి	1,898	2
గద్వాల	1,651	2
అలంపూర్	1,399	2
నారాయణపేట	1,258	3
మక్తల్	958	3
కొడంగల్	1,156	2
షాద్‌నగర్	1,276	2

ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఇలా..

నియోజకవర్గం	మొత్తం రౌండ్లు	టేబుళ్లు	కౌంటింగ్ కేంద్రం
మహబూబ్‌నగర్	20	14	పాలమూరు యూనివర్సిటీ (పరీక్షల విభాగం), మహబూబ్‌నగర్
జడ్చర్ల	20	14	పాలమూరు యూనివర్సిటీ(పరీక్షల విభాగం), మహబూబ్‌నగర్
దేవరకద్ర	21	14	పాలమూరు యూనివర్సిటీ(పరీక్షల విభాగం), మహబూబ్‌నగర్
వనపర్తి	21	14	నూతన మార్కెట్ యార్డు, చిట్యాల, వనపర్తి
నాగర్‌కర్నూల్	19	14	మార్కెట్ యార్డు, నెల్లికొండ, నాగర్‌కర్నూల్
అచ్చంపేట	20	14	మార్కెట్ యార్డు, నెల్లికొండ, నాగర్‌కర్నూల్
కొల్లాపూర్	20	14	మార్కెట్ యార్డు, నెల్లికొండ, నాగర్‌కర్నూల్
కల్వకుర్తి	19	14	సీవీఆర్ కళాశాల, మంగల్‌పల్లి, రంగారెడ్డి జిల్లా
గద్వాల	22	14	ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, గోనుపాడు, గద్వాల
అలంపూర్	21	14	ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, గోనుపాడు, గద్వాల
నారాయణపేట	20	14	శ్రీదత్త బృందావన్ ఇనిస్టిట్యూట్ సింగారం క్రాస్‌రోడ్ (గ్రౌండ్‌ఫ్లోర్)
మక్తల్	21	14	శ్రీదత్త బృందావన్ ఇనిస్టిట్యూట్ సింగారం క్రాస్‌రోడ్ (ఫస్ట్‌ఫ్లోర్)
కొడంగల్	19	14	మార్కెట్ యార్డు, పరిగి, వికారాబాద్ జిల్లా
షాద్‌నగర్	22	12	లార్డ్స్ ఇంజనీరింగ్ కళాశాల, హిమాయత్‌సాగర్

కౌంటింగ్ కేంద్రాల వద్ద ఆంక్షలు..

కౌంటింగ్ కేంద్రాల్లో ఒక్కో నియోజకవర్గానికి 14 చొప్పున టేబుళ్లను ఏర్పాటు చేయనున్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ఒకటి లేదా రెండు టేబుళ్లను కేటాయించనున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థులు, వారి కౌంటింగ్ ఏజెంట్ల సెల్‌ఫోన్లకు అనుమతి లేదు. అలాగే కౌంటింగ్ సమయంలో ఒకరికి బదులుగా మరొకరు వెళ్లడం కానీ, ఏజెంట్ రిలీవింగ్‌ను అనుమతించడం లేదు. ఒక్కో టేబుల్ వద్ద ఒకరి చొప్పున కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక అసిస్టెంట్ సూపర్‌వైజర్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉండనున్నారు. ఉదయం 8 గంటల నుంచే కౌంటింగ్ ప్రారంభం కానుండగా, అంతకుముందు నుంచే కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేయనున్నారు. కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటుచేయనున్నారు. ఒక్కో నియోజకవర్గానికి వేర్వేరుగా కౌంటింగ్ కేంద్రాలు, పార్కింగ్ స్థలాలను కేటాయించారు.

ఎంతో ధీమా.. అంతే భయం..

ఆదివారం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. పోలింగ్ సరళి, అభ్యర్థుల గెలుపుపై ఎవరికి వారు ధీమాను ప్రదర్శిస్తున్నా, ఓటర్ల మనసులో ఏముందో అన్నదానిపై భయం పట్టుకుంది. ఈసారి ఎన్నికల్లో ఓటరు నాడి అంతుబట్టక అభ్యర్థులు అయోమయంలో ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం వరకు స్పష్టమైన ఫలితాలు వెలువడే అవకాశం ఉండటంతో ఓటరు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

గోనుపాడులో ఓట్ల లెక్కింపు

అలంపూర్: మరికొన్ని గంటల వ్యవధిలోనే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంల నుంచి బహిర్గతం కానుంది. గత మూడు రోజుల నిరీక్షణకు.. ఫలితాల లెక్కింపుతో తెరపడనుంది. గద్వాల జిల్లా కేంద్రంలోని గోనుపాడులోని పాలిటెక్నిక్ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే, పోలింగ్ ఫలితాలు ఎలా ఉండబోతున్నాయనే సర్వత్రా చర్చ సాగుతుంది. అలంపూర్ అసెంబ్లీ స్థానానికి 13 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా విజయుడు, కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ ఎస్ఏ సంపత్ కుమార్, బీజేపీ అభ్యర్థిగా పెరుమాళ్ల రాజగోపాల్, బీసీవై అభ్యర్థిగా అయ్యప్పగారి సునీల్ తదితరులు ఉన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య పోటీ హోరాహోరీగా కొనసాగింది.

స్వల్పంగా పెరిగిన ఓటింగ్ శాతం

అలంపూర్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో 82.50 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,37,938 మంది ఓటర్లు ఉండగా, 1,96,307 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికల పోలింగ్‌తో పోల్చితే ఈ సారి పోలింగ్ శాతం 0.19 శాతం పెరిగింది. దీంతో పెరిగిన స్వల్ప ఓట్లు ఎవరికి లాభం చేస్తాయి. ఎవరికి నష్టం కలిగిస్తాయో అనే చర్చ సాగుతుంది.



అలంపూర్‌లోని స్ట్రాంగ్ రూం నుంచి ఈవీఎంలు, వీవీప్యాట్లు తరలిస్తున్న అధికారులు (ఫైల్)

కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

- పొరపాట్లకు తావివ్వొద్దు
- గద్వాల, అలంపూర్‌కు చెరో 38 మంది సూపర్‌వైజర్లు
- కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: సాధారణ ఎన్నికల్లో భాగంగా ఈనెల 3వ తేదీ ఆదివారం కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి అన్నారు. శనివారం ఐడీవోసీ కార్యాలయంలో సాధారణ ఎన్నికల పరిశీలకులు పి.వసంత్‌కుమార్, కౌంటింగ్ పరిశీలకులు అనురాధతో కలిసి ర్యాండమైజేషన్ విధానంలో సిబ్బందిని కేటాయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గద్వాల నియోజకవర్గానికి సంబంధించి మొత్తం కౌంటింగ్ సూపర్‌వైజర్లు–17మంది, కౌంటింగ్ సహాయకులు–17మంది, అదేవిధంగా పోస్టల్‌బ్యాలెట్ లెక్కింపు కోసం ఒక సూపర్‌వైజర్, ఇద్దరు సహాయకులు, ఒక మైక్రోపరిశీలకులను నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా అలంపూర్ నియోజకవర్గానికి సంబంధించి 17మంది సూపర్‌వైజర్లు, 17మంది సహాయకులు, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుకు సంబంధించి ఒక సూపర్‌వైజర్, ఇద్దరు సహాయకులు, ఒక మైక్రో పరిశీలకులు నియమించినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అపూర్వ్‌చౌహాన్, చీర్ల శ్రీనివాసులు, ఆర్డీవో చంద్రకళ, ఎస్‌డీసీ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, సిబ్బందికి శిక్షణ

పొరపాట్లకు తావులేకుండా పకడ్బందిగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి అన్నారు. శనివారం ఆమె ఐడీవోసీ కార్యాయంలో కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే అధికారులు, సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బూత్‌ల వారీగా ఈవీఎం, కంట్రోల్ యూనిట్లు సరి చూసుకుని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో లెక్కింపు ప్రక్రియను మొదలుపెట్టాలన్నారు. ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు, అనంతరం 8:30గంటలకు ఈవీఎం ల లెక్కింపును ప్రారంభించాలన్నారు. ప్రతిరౌండ్ ఫలితాలు ఎప్పటికప్పుడు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అపూర్వ్‌చౌహాన్, చీర్ల శ్రీనివాసులు, ఆర్డీవో చంద్రకళ, కౌంటింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపులో.. మూడంచెల భద్రత

- గుర్తింపు కార్డు ఉన్న వారికే కేంద్రంలోకి అనుమతి
- పరిసర ప్రాంతాల్లో 30 పోలీస్ చట్టం, 144 సెక్షన్ అమలు
- లోపలికి వెళ్లేవారు సెల్‌ఫోన్, వాటర్ బాటిల్స్, అగ్గిపెట్టెలు తీసుకెళ్లడం నిషేధం
- ప్రత్యేక పార్కింగ్ స్థలాలు కేటాయింపు

గద్వాల రూరల్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నిర్ణయం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. వాటి లెక్క పూర్తయితేనే అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి చేపట్టనున్నారు. ఇందుకోసం రక్షణ బాధ్యతలు కల్పించడానికి జిల్లా పోలీస్‌శాఖ అవసరమైన చర్యలు చేపట్టింది. జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓట్లు లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని గోనుపాడు పాలిటెక్నిక్ కళాశాలలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్లు లెక్కించనుండగా.. కేంద్ర బలగాలు, టీఎస్ఎస్పీ, సివిల్ పోలీసులతో మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశారు. కేంద్రంలో విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బంది గుర్తింపు కార్డు ఉన్న వారితో పాటు ప్రత్యేక పాస్ కలిగిన వారికి మాత్రమే అనుమతిస్తారు. లెక్కింపు కేంద్రం పూర్తిగా సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంది.



కట్టుదిట్టమైన ఏర్పాట్లు

గద్వాల క్రైం: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నేడు వెల్లడి కావడంతో జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ రితిరాజ్ అన్నారు. ఆదివారం గద్వాల, అలంపూర్ అసెంబ్లీ ఓట్ల లెక్కింపు గోనుపాడు గ్రామంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులకు సంబంధించిన కార్యకర్తలు, నాయకులు ఎలాంటి ర్యాలీలు, సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరు పోలీసుశాఖకు సహకరించాలన్నారు.

గుర్తింపు కార్డులు ఉంటేనే..

గోనుపాడులోని కళాశాలలో నిర్వహించే అసెంబ్లీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ జిల్లా పోలీస్ శాఖ భారీ భద్రత కల్పిస్తోంది. ప్రధానంగా మూడంచెల భద్రత విధానం అమలు చేయడం వల్ల పటిష్ట నిఘా ఉంటుంది. మొదటి వరుసలో కేంద్ర బలగాలు, రెండో వరుసలో టీఎస్ఎస్పీ సిబ్బంది, ఇక మూడో అంచెలో సివిల్ పోలీసులను నియమించారు. దీంతోపాటు స్పెషల్ పార్టీ పోలీసులు ప్రత్యేకంగా గస్తీ నిర్వహిస్తారు. ఓట్ల లెక్కింపు కోసం నియామకం చేసిన ఉద్యోగులు, సిబ్బందికి ఇప్పటికే గుర్తింపు కార్డులు జారీ చేశారు. ఐటీబీపీ బలగాలు ఉదయం వారిని తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు.

144 సెక్షన్ అమలు..

ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లాలో 30 పోలీస్ చట్టంతోపాటు ఓట్ల లెక్కింపు జరుగుతున్న కేంద్రం పరిసర ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేస్తారు. దీంతో నలుగురు కంటే ఎక్కువ మంది కలిసి ఉండరాదు. ర్యాలీలు, ఉత్సవాలకు అనుమతి ఉండదు. కౌంటింగ్ జరుగుతున్న కేంద్రం పరిసరాల్లో అధిక సంఖ్యలో గుంపులుగా ఉండటం నిషేధం. కౌంటింగ్ సెంటర్‌లోకి వచ్చే రాజకీయ పార్టీల ఏజెంట్లు, వ్యక్తులు మొబైల్ ఫోన్లు, వాటర్ బాటిళ్లు, అగ్గిపెట్టెలు వంటి నిషేధిత వస్తువులను వెంట తీసుకురావొద్దని ఆదేశాలు జారీ చేశారు. వదంతలు వ్యాప్తి చేయడం, దూకుడుగా ప్రవర్తించడం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసే వారిపట్ల అత్యంత కఠినంగా వ్యవహరిస్తారు.

ఐసీటీసీ కేంద్రాల ఎత్తివేత?

- ఉమ్మడి జిల్లాలోని జడ్చర్ల, కల్వకుర్తి, ఆమనగల్, కొడంగల్‌లో కేంద్రాలు
- రెండు, మూడురోజుల్లో రానున్న ఉత్తర్వులు
- ఇకపై ఎయిడ్స్ పరీక్షల నిర్ధారణకు ఇబ్బందులు

జడ్చర్ల టౌన్: ఉమ్మడి జిల్లాలోని హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్ధారణ పరీక్ష కేంద్రాల తొలగింపునకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జడ్చర్ల, కల్వకుర్తి, ఆమనగల్, కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్వహిస్తున్న కేంద్రాలను ఎత్తివేసేందుకు రెండు, మూడు రోజుల్లో ఉత్తర్వులు రానున్నాయి. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ పై నాలుగు కేంద్రాలను ఎత్తివేయాలని ఈ ఏడాది జూన్‌లోనే నిర్ణయం తీసుకుంది. వివిధ కారణాలతో కొంత జాప్యం జరిగింది. తాజాగా రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు ముగియడంతో కేంద్రాల ఎత్తివేత విషయం మరోసారి వెలుగులోకి వచ్చింది. హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షల్లో కీలకమైన కేంద్రాలను తొలగించి వాటి స్థానంలో ఆయా ఆస్పత్రుల్లో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్స్‌కు శాంపిల్ సేకరించే బాధ్యత అప్పగించేలా ఉత్తర్వులు రానున్నాయి.

రాష్ట్ర విభజన తర్వాత..

1992లో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రించే లక్ష్యంతో కేంద్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (న్యాకో)ను స్థాపించింది. ఆయా రాష్ట్రాల్లో ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీల ఆధ్వర్యంలో పనిచేస్తుంది. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ద్వారా న్యాకో విధులు నిర్వహిస్తుంది. అయితే మొదట జిల్లాకేంద్రాల్లోనే న్యాకో ఐసీటీసీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత 30 పడకలు, ఆపై ఉన్న ఆస్పత్రుల్లోనూ ప్రారంభించింది. ఈ క్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట, షాద్‌నగర్, మక్తల్, కొడంగల్, వనపర్తి, గద్వాల, నారాయణపేట, మహబూబ్‌నగర్, ఏనుగొండ ఎస్‌వీఎస్ ఆస్పత్రులతోపాటు ఆమనగల్‌లోనూ ఐసీటీసీ కేంద్రాలు అందుబాటులోకి వచ్చి సేవలు అందిస్తున్నాయి. ఆయా కేంద్రాల్లో నెలకు కనీసం 300 నుంచి 500 పరీక్షలు చేస్తున్నారు. ఐసీటీసీ కేంద్రాల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలు గర్భిణులు, టీబీ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, తరచుగా రక్తమార్పిడి చేయించుకునే వారికి తప్పనిసరిగా హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలు చేయాల్సిందే. హెచ్ఐవీ నిర్ధారణ అయిన వారు గర్భిణులు అయితే వారికి పుట్టిన పిల్లలకు సైతం పరీక్షలు చేస్తున్నారు. ప్రస్తుతం ఎత్తివేసేందుకు సిద్ధంగా ఉన్న జడ్చర్ల ఆస్పత్రిలోని ప్రతినెలా 500లకు తక్కువ కాకుండా పరీక్షలు నిర్వహిస్తున్నారు.



జడ్చర్ల ఆస్పత్రిలోని ఐసీటీసీ కేంద్రం



పరీక్షలు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

రెండు జాతీయ రహదారులతో..

జడ్చర్ల మీదుగా 44, 167 నంబర్ రెండు జాతీయ రహదారులు వెళ్తుండటంతో ఈ ప్రాంతంలో వ్యభిచారం ఎక్కువగా జరుగుతుంది. వ్యభిచార వృత్తిలో ఉన్న వారితోపాటు వారి వద్దకు వెళ్లేవారు సైతం హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలు చేసుకుంటున్నారు. అలాగే గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి సైతం పరీక్షలు చేస్తున్నారు. ఈ క్రమంలో స్థానికంగా ఉన్న ఐసీటీసీ కేంద్రం ఎత్తివేస్తే వీరందరికి ఇబ్బందిగా మారనుంది. తాత్కాలికంగా ఆస్పత్రుల్లోని జనరల్ ల్యాబ్ టెక్నీషియన్స్‌కు బాధ్యతలు అప్పగించేలా చర్యలు తీసుకున్నప్పటికీ పనిభారం పెరిగి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. వాస్తవానికి న్యాకో ఎత్తివేయాలని భావిస్తున్న కేంద్రాల్లో జడ్చర్లలో సేవలు అధికంగా జరుగుతున్నాయి. అయితే ఏనుగొండ ఎస్‌వీఎస్ ఆస్పత్రి సమీపంలోనే ఉండటం వల్ల ఈ కేంద్రం ఎత్తివేయాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే ఆమనగల్ కేంద్రంలో కౌన్సిలర్ లేకపోవడంతో అక్కడ పరీక్షలు తక్కువగా జరుగుతున్నాయి. ఇక కల్వకుర్తి, కొడంగల్ కేంద్రాల్లోనూ నెలవారి పరీక్షలు తక్కువగా నమోదవుతుండటంతో ఆయా కేంద్రాలు ఎత్తివేసేందుకు నిర్ణయించారు.

■ ఐసీటీసీ కేంద్రం ఎత్తివేత విషయమై స్థానిక ల్యాబ్ టెక్నీషియన్ శ్రీకాంత్‌ను 'సాక్షి' వివరణ కోరగా రెండు, మూడు రోజుల్లో ఉత్తర్వులు రానున్నట్లు వెల్లడించారు. కేంద్రం ఎత్తివేత గురించి ఇది వరకే సమాచారం ఇచ్చారని, ఉత్తర్వులు రాగానే ఇక్కడి నుంచి తొలగిస్తామని చెప్పారు.

క్లుప్తంగా

చిల్వేర్‌లో వివాహిత బలవన్మరణం

మిడ్జిల్: మండలంలోని చిల్వేర్‌కు చెందిన వివాహిత నందిని(31) శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు శనివారం తెలిపారు. ఈమె రెండేళ్ల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా, ఎన్ని ఆస్పత్రులకు చూయించుకున్న ప్రయోజనం లేకపోవడంతో శుక్రవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి..

అమరచింత: కుటుంబ కలహాలతో బోయ వెంకటన్న (52) తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని శనివారం ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో చోటుచేసుకుంది. అమరచింత పట్టణానికి చెందిన బోయ వెంకటన్న 15ఏళ్ల కిందట మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో భార్య పిల్లలతో నివసిస్తున్నాడు. కూలీపనులతో పాటు పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడని గ్రామస్తులు తెలిపారు. గురువారం అసెంబ్లీ ఎన్నికల సమయంలో అమరచింతకు వచ్చి ఓటేసి వెళ్లిన ఆంజనేయులు శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు కుటుంబకలహాలే కారణం కావచ్చని గ్రామస్తులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ధరూరు: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎములోనిపల్లికి చెందిన ఆంజనేయులు మద్యానికి బానిసై తిరిగే వాడని పోలీసులు తెలిపారు. గత నెల 23న పురుగుల మందు తాగాడు. ఆయనను అదే రోజు గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- ముగ్గురికి తీవ్రగాయాలు

భూత్పూర్: మున్సిపాలిటీలోని గోప్లాపూర్ వద్ద శనివారం బైక్‌ను కారు ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలైనట్లు హెడ్‌కానిస్టేబుల్ రాంచంద్రయ్య తెలిపారు. మండలంలోని మద్దిగట్లకు చెందిన శివకుమార్‌తో పాటు అతని స్నేహితులు జీ.మహేష్, గడ్డమీది మహేష్ బైక్‌పై భూత్పూర్ నుంచి కొత్త మొల్గర వైపు వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న కారు ఢీకొటింది. దీంతో శివకుమార్, జీ.మహేష్, గడ్డమీది మహేష్‌లకు తీవ్రగాయాలు కాగా అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. శివకుమార్ తండ్రి కొండయ్య ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ రాజు ప్రకాష్‌పై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఎన్నికల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తుల అరెస్ట్

ధరూరు: శాసనసభ ఎన్నికల్లో పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన తండ్రీ కొడుకులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శివానందం గౌడ్ తెలిపారు. మండలంలోని గుడ్డెందొడ్డికి చెందిన మదనపల్లి వెంకటన్న అలియాస్ పల్లె వెంకటన్న, అతని కుమారుడు ఎన్నికల విధులకు ఆటంకం కలిగించినట్లు గత నెల 30వ తేదీన పోలీసులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి తండ్రీ, కొడుకులను శనివారం అరెస్ట్ చేసి గద్వాల కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాలీబాల్ అకాడమీలో ప్రవేశాలు జరిగేనా?



అకాడమీ ప్రవేశాల కోసం నిర్వహించిన ఎంపికలకు హాజరైన క్రీడాకారులు (ఫైల్)

- అకాడమీకి చేరిన క్రీడాకారుల వసతి సౌకర్యాలు
- ఎంపికలు పూర్తయ్యి ఏడాది..

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్ జిల్లాకు క్రీడల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ముఖ్యంగా వాలీబాల్‌లో జిల్లా జట్టు రాష్ట్రంలో ఎక్కడ టోర్నీ ఉన్నా సత్తా చాటేవారు. 2004లో రాష్ట్ర క్రీడాప్రాధికారిక సంస్థ జిల్లాకు వాలీబాల్ అకాడమీ మంజూరు చేసింది. అకాడమీ నడిచిన నాలుగేళ్లలో జిల్లా క్రీడాకారులు ఎంతో ప్రతిభ కనబరిచేవారు. వాలీబాల్ అకాడమీలో శిక్షణ పొందిన జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడాకారులుగా ఎదిగారు. వీరు మొదట్లో అకాడమీలో వాలీబాల్‌లో ఓనమాలు నేర్చుకొని దేశానికి ప్రాతినిథ్యం వహించారు. ఇదే అకాడమీలో శిక్షణ పొందిన పలువురు క్రీడాకారులు జాతీయ సీనియర్ వాలీబాల్ పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. అయితే నిధుల నిర్వహణ భారంతో 2008లో వాలీబాల్ అకాడమీని మూసివేశారు.

మళ్లీ వాలీబాల్ అకాడమీ ఏర్పాటు

జిల్లా కేంద్రంలోని మెయిన్‌స్టేడియంలో వాలీబాల్ అకాడమీ 2022లో తిరిగి ఏర్పాటైంది. స్టేడియం ఆవరణలోగల స్విమ్మింగ్‌పూల్‌లోని అంతస్తుల గదులను అకాడమీ క్రీడాకారుల వసతి కోసం కేటాయించి గదుల ఆధునీకీకరణ పనులు చేపట్టారు. స్టేడియంలోని రెండు పాత వాలీబాల్ కోర్టులను తీసివేసి వాటి స్థానంలో కొత్త కోర్టులు ఏర్పాటు చేశారు. కోర్టుల చుట్టూ నాలుగు ఫ్లడ్‌లైట్లు, ప్రత్యేక షెడ్లు, గ్యాలరీ ఏర్పాటు చేశారు. గోడ చుట్టూ ఆకర్షణీయంగా వాలీబాల్ క్రీడాచిత్రాలను తీర్చిదిద్దారు.

త్వరలో ప్రవేశాలు



జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ అకాడమీలో త్వరలో క్రీడాకారుల ప్రవేశాలు కల్పిస్తాం. ఇప్పటికే క్రీడాకారుల వసతి సామగ్రి వచ్చాయి. అకాడమీ ఏర్పాటుతో నైపుణ్యంగల క్రీడాకారులను వెలికితీయవచ్చు. ప్రవేశాలకు సంబంధించి ఇది వరకే ఎంపికలు నిర్వహించాం. శాట్ ఆదేశాల మేరకు త్వరలో ప్రవేశాలు కల్పిస్తాం.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

ఏడాది అవుతున్నా ప్రవేశాలు పొందని క్రీడాకారులు

జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ అకాడమీలో ప్రవేశాల కోసం గతేడాది డిసెంబర్ 1వ తేదీన రాష్ట్రంలోని బాల, బాలికలకు ఎంపికలు నిర్వహించారు. అండర్ 14–18 ఏళ్ల మధ్య వయస్సు బాల, బాలికలకు ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి బాల, బాలికలు హాజరయ్యారు. ఎంపికలు నిర్వహించి ఏడాది అవుతున్నా ఇంత వరకు అకాడమీలో క్రీడాకారులకు ప్రవేశాలు కల్పించలేదు. అకాడమీలో ప్రవేశం పొంది శిక్షణ తీసుకోవాలన్న క్రీడాకారుల ఆశలు అడియాశలయ్యాయి.

ఓట్ల రీకౌంటింగ్‌కు సమయం

- అంతలోపే కారణాలు చూపి లెటర్ అందించాలి
- ఫలితం ప్రకటిస్తే రిటర్నింగ్ అధికారి చేసేదేమీ ఉండదు
- అనుమానం ఉంటే వీవీప్యాట్ స్లిప్పులు లెక్కించమని కోరవచ్చు



కల్వకుర్తి టౌన్: ఓటింగ్ యంత్రాల్లో నమోదైన ఓట్లను మళ్లీ లెక్కించటం అంటూ ఉండదు. ఓటింగ్ యంత్రంలో నమోదైన ప్రతి ఓటు చెల్లుబాటయ్యేదే. అది చెల్లదు అనే విషయానికి, వివాదానికి తావు లేదు. పోలింగ్ స్టేషన్ ఓటింగ్ ఫలితాన్ని కొంత మంది అభ్యర్థులు, వారి ఏజెంట్లు రాసి పెట్టుకుని ఉండకపోతే, ఫలితం–1 బటన్‌ను నొక్కుతారు. అప్పుడు కంట్రోల్ యూనిట్‌లోని డిస్‌ప్లే ప్యానల్లలో ఆ పోలింగ్ స్టేషన్ ఓటింగ్ ఫలితం కనిపిస్తుంది.

- మొత్తం లెక్కింపు పూర్తయిన తర్వాత రిటర్నింగ్ అధికారి తుది ఫలితం ఫారం–20లో నమోదైనట్లు, ప్రతి అభ్యర్థి పొందిన మొత్తం ఓట్ల సంఖ్యను ప్రకటిస్తారు. ప్రకటన పూర్తయ్యాక అభ్యర్థి లేదా అతని గైర్హాజరులో అతని ఏజెంటు లేదా కౌంటింగ్ ఏజెంట్లలో ఏ ఒక్కరయినా అన్ని లేదా పోలింగ్ స్టేషన్‌లో అయినా నమోదైన ఓట్లను మళ్లీ లెక్కించాలని లిఖితపూర్వకంగా అందుకు కారణాలను వివరిస్తూ అభ్యర్థన ఇవ్వాలి.
- ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శక సూత్రాలు ఆధారంగా ఎన్నికల నిర్వహణ నియమావళి నియమం 56–డి ప్రకారం రిటర్నింగ్ అధికారి మళ్లీ ఓట్ల లెక్కింపునకు నిర్ణయం తీసుకుంటారు. వీవీప్యాట్‌లో ముద్రితమైన పేపర్ స్లిప్పులను లెక్కిస్తారు.
- రిటర్నింగ్ అధికారి ఓట్ల రీకౌంటింగ్, లిఖిత అభ్యర్థన ఇచ్చేందుకు ఖచ్చితంగా సమయం, నిమిషాలను ప్రకటిస్తారు. అంతలోపు ఏదైనా అభ్యర్థన వస్తే పరిశీలించి సహేతుకం అయితే నిర్ణయం తీసుకుంటారు.
- రిటర్నింగ్ అధికారి ఫలితం షీట్‌ను పూర్తిచేసి సంతకం చేశాక ఎలాంటి అభ్యర్థనకు హక్కు ఉండదు.
- ఓట్ల లెక్కింపు తర్వాత ఫారం–17సి భాగం–2లో ఫలితంలో అభ్యర్థి వారిగా కంట్రోల్ యూనిట్‌లో నమోదైన ఓటింగ్ ఫలితాలను నింపాక తుది ఫలితం షీట్ ఫారం–20 కూడా నింపి రిటర్నింగ్ అధికారి తన సీల్‌తో యూనిట్లను మళ్లీ సీల్ చేస్తారు.

ముందుగా పోస్టల్ బ్యాలెట్ పత్రాల లెక్కింపు

- అధికారిక కవర్‌లో రాకుంటే తిరస్కరణ
- లెక్కింపు ప్రక్రియ అంతా వీడియో చిత్రీకరణ



కల్వకుర్తి టౌన్: శాసనసభ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. తొలుత రిటర్నింగ్ అధికారి పోస్టల్ బ్యాలెట్ పత్రాల లెక్కింపు చేపడతారు. అరగంట వెసులుబాటు తర్వాత ఈవీఎంల లెక్కింపును అధికారులు ప్రారంభిస్తారు.

- పోస్టల్ బ్యాలెట్ పత్రాల లెక్కింపు కొరకు ప్రత్యేకమైన టేబుల్ ఏర్పాటు చేస్తారు. సహాయ రిటర్నింగ్ అధికారి సహకారంతో రిటర్నింగ్ అధికారి బాధ్యత వహిస్తారు.
- ఓటరు నుంచి వచ్చే ప్రతి పోస్టల్ బ్యాలెట్ పత్రం, ఫారం–13బిలో కవర్‌లో ఉంటుంది. ఈ కవర్, ఫారం–13ఏలో ఎలక్టర్ చేసిన డిక్లరేషన్‌తో పాటు మరో పెద్ద కవర్‌లో ఉంటుంది. ఈ పెద్ద కవర్ ఫారం–13సిలో ఉండి రిటర్నింగ్ అధికారి చిరునామాపై ఉండాలి.
- లెక్కింపు ప్రారంభానికి ఉదయం 8 గంటల తర్వాత వచ్చే ఏ పోస్టల్ బ్యాలెట్ పత్రం కలిగిన ఫారం–13సి కవర్‌ను రిటర్నింగ్ అధికారి తెరవడు. ఫారం–13సిలో ఉన్న పై కవర్ మీద నోట్ రాస్తాడు. ఈ కవర్లలోని ఓట్లను లెక్కించటం జరగదు. అలాంటి కవర్లన్నింటిని ఓ ప్యాకెట్‌గా చేసి సీలు వేస్తారు.
- పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి డిక్లరేషన్ పత్రాలపై సంతకాలు, కవర్లు అన్ని సరిచూసిన తర్వాతే రిటర్నింగ్ అధికారి దాని చెల్లుబాటును నిర్ణయిస్తారు.
- పోస్టల్ బ్యాలెట్‌పై ఓటు నమోదు కాని పక్షంలో, ఒకరి కంటే ఎక్కువ మంది అభ్యర్థులకు ఓటు నమోదు చేసినా, తప్పు బ్యాలెట్ పేపర్ అయినా, బ్యాలెట్ పత్రం పూర్తిగా చిరిగిపోయినా, ఎలక్టర్‌కు పంపిన కవర్‌లో దాన్ని తిరిగి పంపకపోయినా, నమోదు చేసిన గుర్తు ఏ అభ్యర్థికి ఓటువేశారో నిర్ధారణ కాకుండా సందేహం కలిగించే విధంగా ఉన్నా, ఓటరును గుర్తించే ఏ గుర్తుగానీ, రాతకాని బ్యాలెట్ పత్రం రాసి ఉంటే చెల్లని ఓటుగా తిరస్కరిస్తారు.
- చెల్లని ఓట్లను, ప్రతి అభ్యర్థికి వచ్చిన ఓట్లను లెక్కించి ఫారం–20లో ఫలితం నమోదు చేస్తారు.
- పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపైనే అభ్యర్థి గెలుపు నిర్ధారితమయ్యే సందర్భంలో రిటర్నింగ్ అధికారి అనివార్యంగా వాటిని మళ్లీ ధ్రువీకరణ చేసి ప్రతి అభ్యర్థి పక్షాన లెక్కింపబడిన ఓట్లను మరోసారి పరిశీలించి సంఖ్య సరిపోయిందా లేదా ఫలితానికి తుది రూపం ఇస్తారు.
- మళ్లీ లెక్కింపు జరిగినప్పుడు రహస్యం భగ్నం కాని విధంగా మొత్తం వీడియో చిత్రీకరణ చేస్తారు.

మద్యం దుకాణాల్లో విక్రయాలు షురూ..

- మొదటి రోజు రూ.5కోట్ల స్టాక్ కొనుగోలు

నాగర్‌కర్నూల్ క్రైం: కొత్త ఎక్సైజ్‌పాలసీ 2023–25కి సంబంధించి జిల్లాలో 67 మద్యం దుకాణాల్లో శుక్రవారం సాయంత్రం నుంచి విక్రయాలు ప్రారంభించారు. జిల్లాలోని తిమ్మాజిపేట స్టాక్‌పాయింట్ నుంచి రూ.5 కోట్లకు పైగా ఐఎంఎల్ మద్యంతో పాటు బీర్లను దుకాణాదారులు కొనుగోలు చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రెండురోజుల పాటు జిల్లాలో మద్యం దుకాణాలు మూసివేయడంతో మద్యం ప్రియులు ఇబ్బందులు పడినప్పటికీ శుక్రవారం నుంచి జిల్లాలోని దుకాణాల్లో విక్రయాలు మొదలు కావడంతో వారి సమస్య తీరింది. ఈ ఏడాది నిర్వహించిన మద్యం టెండర్లలో కొందరు కొత్త వ్యక్తులు ఉండగా, మరికొందరు పాత వ్యక్తులు షాపులు దక్కించుకున్నారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు మద్యం దుకాణాలు దక్కించుకున్నవారికి నిబంధనలు పాటించాలని, పర్మిట్ రూంలు ఏర్పా టు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ ఏడాది డిసె ంబర్1 నుంచి ప్రారంభమయ్యే మద్యం దుకాణా లు 2025 నవంబర్ 30వరకు కొనసాగనున్నాయి.

జిల్లాలో 67 దుకాణాలు

జిల్లాలో 67 మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. ఇందులో నాగర్‌కర్నూల్ స్టేషన్‌పరిధిలో 18, కల్వకుర్తి స్టేషన్‌పరిధిలో 17, అచ్చంపేట స్టేషన్ పరిధిలో 13, కొల్లాపూర్ స్టేషన్ పరిధిలో 12, తెలకపల్లి స్టేషన్ పరిధిలో 7 మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు.



కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణం

నిబంధనలు పాటించాలి



కొత్త మద్యం పాలసీ ప్రకారం ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. మద్యం దుకాణాదారులు నిబంధనలు పాటించకుంటే చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు షాప్‌ను సీజ్ చేస్తాం.

– షేక్ ఫయాజుద్దీన్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్, నాగర్‌కర్నూల్

కొనుగోళ్ల వివరాలు

జిల్లాలోని మద్యం దుకాణాల్లో మొదటిరోజు రూ.5కోట్లకు పైగా ఐఎంఎల్ మద్యంతో పాటు బీర్లను కొనుగోలు చేసినట్లు ఎక్సైజ్‌శాఖ అధికారులు వెల్లడించారు. జిల్లాలో 5 ఎక్సైజ్ స్టేషన్లు కొనసాగుతుండగా మొదటి రోజు అచ్చంపేట స్టేషన్ పరిధిలో 1,009 ఐఎంఎల్ మద్యం కేసులు, 1,906 బీర్‌కేసులు, కల్వకుర్తి స్టేషన్ పరిధిలో 1,563 ఐఎంఎల్ మద్యం కేసులు, 2,904 బీర్ కేసులు, కొల్లాపూర్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో 1,080 ఐఎంఎల్ మద్యం కేసులు, 1,583 బీర్ కేసులు, నాగర్‌కర్నూల్ స్టేషన్ పరిధిలో 1,666 ఐఎంఎల్ మద్యం కేసులు, 3,092 బీర్ కేసులు, తెలకపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 499 ఐఎంఎల్ మద్యం కేసులు, 998 బీర్ కేసులు మద్యం దుకాణాదారులు కొనుగోలు చేశారు. మొదటి రోజు సగానికిపైగా స్టాక్ విక్రయించినట్లు అధికారులు వెల్లడించారు.

నేడు, రేపు ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఆదివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అండర్–14 బాల, బాలికలు, సోమవారం ఉమ్మడి జిల్లా అండర్–17 విభాగం బాల, బాలికల అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు విద్యార్థులు రిపోర్టు చేయాలని కోరారు. అండర్–14 విభాగం వారికి 100 మీ., 200 మీ., 400 మీ., 600 మీటర్ల పరుగుతోపాటు లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, అండర్–17 వారికి 100 మీ., 200 మీ., 400 మీ., 800 మీ., 1500మీ., 3వేల మీటర్ల పరుగుతోపాటు లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, హ్యామర్‌త్రో, 5 కి.మీ., 3 కి.మీ., వాకింగ్ అంశాల్లో ఎంపికలు ఉంటాయన్నారు. విద్యార్థులు పాఠశాల బోనోఫైడ్, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని, పూర్తి వివరాల కోసం సెల్ నంబర్లు 94401 60104, 98497 06360 సంప్రదించాలని సూచించారు.

కోయిల్‌సాగర్‌లో 32.2 అడుగుల నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం శనివారం సాయంత్రం వరకు 32.2 అడుగులకు చేరుకుంది. జూరాల నుంచి ఎత్తిపోతల ద్వారా నీటిని కోయిల్‌సాగర్‌కు విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా.. ప్రస్తుతం 0.4 ఇంచులు తక్కువగా ఉంది. దీంతో జూరాల నుంచి నీటి విడుదలను శనివారం నిలిపివేశారు. ఈ ఏడాది యాసంగి పంటలకు నీటిని వదిలే విషయం ఇంకా అధికారులు ప్రకటించలేదు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రాజెక్టు నీటిని వేసవిలో తాగునీటి కోసం ఉపయోగించే అవకాశం ఉన్నట్లు అధికారులు గతంలో పేర్కొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడిపై దాడి



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రాములు

- మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ నాయకుల ధర్నా
- భారీగా ట్రాఫిక్ జాం

మహబూబ్‌నగర్ క్రైం: కిరాణ సామాన్లు తీసుకుంటున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడిపై దాడి చేయడం పట్టణంలో కలకలం రేపింది. ఈ ఘటనపై కాంగ్రెస్ నేతలు ఆందోళన నిర్వహించారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు గవినోళ్ల వెంకట్‌రెడ్డిపై దాడి చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు శనివారం రాత్రి రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట జడ్చర్ల–మహబూబ్‌నగర్ రోడ్డుపై ధర్నా చేశారు. వివరాల్లోకి వెళితే.. శ్రీనివాస కాలనీకి చెందిన గవినోళ్ల వెంకట్‌రెడ్డి శనివారం సాయంత్రం 5:40గంటల ప్రాంతంలో ఎస్‌వీ మార్ట్ దగ్గర కిరాణా సామాన్లు తీసుకుంటున్న క్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీకాంత్‌గౌడ్ కొంతమందితో అక్కడికి వచ్చి కాంగ్రెస్‌కు ప్రచారం చేశావని తనపై దాడి చేస్తూ సూపర్‌మార్కెట్‌లో నుంచి బయటకు తెచ్చారని వెంకట్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీకాంత్‌గౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ మహేష్ వెల్లడించారు.

రెండు గంటల పాటు ధర్నా



జిల్లా కేంద్రంలో నిలిచిపోయిన వాహనాలు

దాడిఘటనపై కాంగ్రెస్ నేతలు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాదాపు రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించడంతో ఇటూ జడ్చర్ల వైపు అటూ బస్టాండ్ వైపు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం అయ్యింది. ఈ సమయంలో ఒకరిద్దరూ రోగులు ఆస్పత్రికి వెళ్లే వారు ఇబ్బంది పడ్డారు. ఆందోళన చేస్తున్న వారితో జిల్లా అదనపు ఎస్పీ రాములు చర్చలు జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అదేవిధంగా వెంకట్‌రెడ్డి ఇంటికి ఇద్దరూ కానిస్టేబుల్స్‌ను రక్షణగా ఇచ్చారు.

చెక్‌డ్యాంలతో జలసిరి

- నీటితో కళకళలాడుతున్న చెరువులు
- యాసంగిలో వరిసాగుపై ఆసక్తి



పూసల్‌పహాడ్ వద్ద కేఎస్పీ వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలో నీరు

మరికల్: కోయిల్‌సాగర్ మన్నెవాగులపై నిర్మించిన చెక్‌డ్యాంలు నీటితో కళకళలాడుతున్నాయి. జూరాల ఎత్తిపోతలతో కోయిల్‌సాగర్‌ను పూర్తిస్థాయిలో నింపడం వల్ల జలసిరి సంతరించుకుంది. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో కోయిల్‌సాగర్ నీటితో మరికల్ మండలంలోని తీలేర్, వెంకటాపూర్, పెద్ద చింతకుంట, మరికల్, అప్పంపల్లి చెరువులను నింపారు. అలాగే కోయిల్‌సాగర్ షెట్టర్ల నుంచి వచ్చిన నీటితో పాటు అడపా, దడప కురిసిన వర్షాలకు ప్రాజెక్ట్ నుంచి చిన్నచింతకుంట మండలం వరకు నిర్మించిన చెక్‌డ్యాంలు పూర్తి స్థాయి నీటిమట్టంతో ఉన్నాయి. దీంతో వాగు పరివార ప్రాంతం చుట్టూ ఉన్న వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు పెరిగాయి. యాసంగిలో రైతులు ఆశించిన స్థాయిల్లో వరిసాగు చేయడం కోసం కసరత్తు ప్రారంభించారు.

చెక్‌డ్యాంలు నిర్మించాల్సిన వాగులు ఇవే..

భూగర్భ జలాలు పెంచేందుకు వాగుల్లో చెక్‌డ్యాంల నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఎంతో ఉంది. సాగునీటి వనరులు లేకపోవడంతో చెరువులు, కుంటలపై ఆధారపడి పంటలు పండించుకోవాల్సి వస్తుంది. వాగులపై ఎక్కడికక్కడ చెక్‌డ్యాంలను నిర్మిస్తే పెద్ద మొత్తంలో నీటి నిల్వ చేపట్టే అవకాశం ఉంది.

- ధన్వాడ మండలంలోని కొండాపూర్ వాగుపై రెండు, కిష్టాపూర్ వాగుపైన చెక్‌డ్యాం నిర్మాణాల కోసం అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి అధికారులకు పంపించారు. నిధులు మంజూరు కావాల్సి ఉంది. ఇక్కడ చెక్‌డ్యాంలు ఏర్పాటైతే భూగర్భ జలాలు పెరిగి రైతులకే కాదు గ్రామస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.
- దామరగిద్ద మండలంలో మద్దెల్‌బీడ్ వాగుపై చెక్‌డ్యాం ఏర్పాటు కోసం గతంలో పరిశీలించారు. పెద్దవాగు కావడంతో పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దీంతో మద్దెల్‌బీడ్ ప్రాంతంతో పాటు జిల్లా కేంద్రానికి భూగర్భ జలాలు పెరుగుతాయి. ఈ ప్రాంత రైతులు ఎన్నో ఏళ్ల నుంచి చెక్‌డ్యాం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.
- ఊట్కూర్ మండలంలో ఓబ్లాపూర్, పగిడిమర్రి మధ్యలో వాగుపై అమీన్‌పూర్ వాగుపై చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టాల్సి ఉంది. నీటి నిల్వతో ఎంతో ప్రయోజనంగా ఉంటుంది.
- నర్వ మండలంలో కొత్తపల్లి, పెద్దకడ్మూరు మధ్యలో వాగుపై వంతెనతో కూడిన చెక్‌డ్యాం నిర్మించడం వలన రాకపోకలకు అనుకూలంగా ఉండడంతో పాటు భూగర్భ జలాలు పెరుగుతాయి.
- మక్తల్ మండలంలోని జక్లేర్ వాగుపైన బొందల్‌కుంట వాగుపైన, మంథన్‌గోడ్, లింగపల్లి వాగు, కర్నివాగులపై చెక్‌డ్యాంలు నిర్మిస్తే నీటి నిల్వకు ఆస్కారం ఉంది. దీంతో ఇక్కడి రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.
- మద్దూరు మండలంలోని తిమ్మారెడ్డిపల్లి వాగుపై వంతెనతో కూడిన చెక్‌డ్యాం ఏర్పాటుకు మంత్రి సత్యవతి రాథోడ్, శ్రీనివాస్‌గౌడ్ శంస్థాపన చేసినా ఇంకా పనులు ప్రారంభం కాలేదు. ఇక్కడ చెక్‌డ్యాం ఏర్పాటు చేస్తే పెద్ద మొత్తంలో నీరు నిల్వ ఉంటుంది. అలాగే పెద్దాపూర్ వాగుపైన, మద్దూర్–నాగిరెడ్డిపల్లి మధ్యన వాగుపైన రాకపోకలకు అనుకూలంగా వంతెనతో కూడిన చెక్‌డ్యాం, ఖాజీపూర్ చెరువు వద్ద వంతెన ఏర్పాటు చేయాల్సి ఉంది.
- కోస్గి మండలంలోని అమ్లికుంట వాగుపై చెక్‌డ్యాంను, కడంపల్లి వాగుపై వంతెనతో పాటుగా చెక్‌డ్యాంను నిర్మించాలి. దీంతో ఈ దారిలో పోయే వారికి అనుకూలంగా ఉండడంతో పాటు నీటి నిల్వను చేపట్టవచ్చు.